# ఆశించిన ప్రయోజనం సిద్ధింపజేసుకున్న పుస్తకం: వూండెడ్ హార్ట్

~ కొల్లూరి సోమశంకర్



**సమీక్ష:** ఆశించిన ప్రయోజనం సిద్ధింపజేసుకున్న పుస్తకం – వూండెడ్ హార్ట్

**రచన:** కొల్లూరి సోమశంకర్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=516

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

## ఆశించిన ప్రయోజనం సిద్ధింపజేసుకున్న పుస్తకం – వూండెడ్ హార్ట్

కవిత్వం ఎన్నో రకాలు. తన మనసులోని భావాలను ఇతరులతో పంచుకోడానికి కవి/కవయిత్రి చేసే ప్రయత్నం కవిత్వం. ఆ భావాలు ఆనందానివి కావచ్చు, దుఃఖానికి కావచ్చు, ఆందోళనవి కావచ్చు, ఉద్వేగానికి కావచ్చు, భయాలవి కావచ్చు, ఉత్సాహానివి కావచ్చు, ఉల్లాసానివి కావచ్చు. ప్రతీ రచనకి ఒక నిర్దిష్ట ప్రయోజనం ఉన్నట్లే ఒక లక్ష్యం కోసం రాసే కవిత్వానికి ఒక ప్రయోజనం ఉంటుంది.

అటువంటి కోవకే చెందినది శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారి "మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్". పుస్తకం శీర్షిక ఆంగ్లంలో ఉన్నా, కవిత్వం మాత్రం చక్కని తెలుగులో సాగిపోతుంది. ఇతివృత్తం, కవితావస్తువు సార్వజనీనమైనది. శీర్షిక సూచిస్తున్నట్లుగానే, ఈ దీర్ఘకవితకి వస్తువు గాయపడ్డ హృదయం. ఈ గాయపడడం అనేది మాటల వల్ల కాకుండా, కాన్సర్ వల్ల. అంటే బ్రెస్ట్ కాన్సర్ గురించన్న మాట.

ఈమధ్య కాలంలో వచ్చిన వచన కవిత్వంలో అనుభూతి ప్రధానమైనవి కాకుండా, ఓ ఆరోగ్య సమస్యని కవితావస్తువుగా ఎంచుకుని కవి భావాలని పాఠకులకు హృదయాలకు హత్తుకునేలా చెప్పడంలో విజయం సాధించిన కొన్నిపుస్తకాలలో "మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్" కూడా ఒకటి.

సాధారణంగా మహిళా సమస్యలపై వచ్చే కవిత్వం జెండర్‌కీ, గృహ హింసలకీ చెందినదై ఉంటుంది. తమపై జరుగుతున్న అత్యాచారాలకు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా తోటి మహిళలను జాగృతం చేయడానికి ఈ కవిత్వం ఉపయోగపడుతోంది. అయితే బ్రెస్ట్ కాన్సర్ సమస్యపై మహిళలను జాగృతం చేసే ఉద్దేశంతో వెలువడిన తొలి తెలుగు దీర్ఘ కవిత "మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్".

ఇండియన్ జర్నల్ ఆఫ్ కాన్సర్, సంపుటి 46, సంచిక 1 ప్రకారం, గత దశాబ్దంలో భారతదేశంలో మహిళలను సెర్వికల్ కాన్సర్ పట్టి పీడించగా, ఈ దశాబ్దంలో బ్రెస్ట్ కాన్సర్ విజృంభించింది. పారిశ్రామికీకరణ, నగరీకరణ విపరీతంగా జరిగి, పౌరుల జీవనశైలులలో కొత్తకొత్త మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవి బ్రెస్ట్ కాన్సర్ త్వరితగతిన విస్తరించేందుకు దోహదం చేస్తున్నాయి. అనేక కారణాల వల్ల దేశంలో మామోగ్రఫీ నిర్వహించడం కష్టమని, బ్రెస్ట్

కాన్సర్ పై అవగాహన కల్పించి, తొలి దశలోనే నివారణా చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

బ్రెస్ట్ కాన్సర్‌పై అవగాహన కల్పించడంలో తన వంతు పాత్రగా, దీర్ఘ కవిత రచించి, ప్రచురించారు అయినంపూడి శ్రీలక్ష్మి. ఈ ప్రయత్నం ఎందుకు చేశారో, ఆవిడ మాటల్లోనే తెలుసుకుందాం. "ఎంతోమంది వ్యాధిగ్రస్తుల్ని చూశాను. అనుభవాల్ని విన్నాను. గత 15 సంవత్సరాలుగా నేనూ బ్రెస్ట్ ఫైబ్రినాయిడ్స్ బాధితురాలనే – నేను హస్పటల్‌కి వెళ్తున్న ప్రతిసారి నా వాళ్ళెంత ఆరాటంగా, భయంగా వుంటారో నాకు బాగా తెల్సు. చివరికి అర్థమయ్యింది ఒక్కటే – మన ధైర్యమే మనల్ని బ్రతికిస్తుంది. మృత్యువుతో పోరాటానికి కావల్సింది మందులు కాదు ముఖ్యంగా కావల్సింది మనోధైర్యమే. జీవితంలో ఏదీ వట్టిగా రాదు, ఒక్క వ్యాధులు తప్ప అనే వారు ఎందరో వున్నారు. కానీ వ్యాధి మాత్రం అవగాహన లేమితోనే ఎక్కువ భయపెడ్తుంది అని నేను గట్టిగా నమ్ముతాను. క్యాన్సర్ పట్ల కాస్త అవగాహన పెంచుకుంటే చాలు – మనకిక కలవరాలుండవు – కన్నీళ్ళ కుటుంబాలుండవు – ధైర్యంగా ముందుకు కదలగల్గితే నడవడమేమిటి ఏకంగా పరుగులే పెట్టొచ్చు."

కాన్సర్‌ని పరిచయం చేస్తూ, "సునామీ తెల్సు/భూకంపం తెల్సు/గ్రహ శకలాలు తెల్సు/అణు విస్ఫోటనం తెల్సు/కానీ–/కణ విస్ఫోటనం మాత్రం/కొత్తదే కదా!" అంటారు. "మహా సంక్షోభానికి/మహా విపత్తే అక్కర్లేదు/ఒక్క కణం కన్నెర్ర చాలు", "భూగోళమంత ఎగోనీకి/మహాసాగరమే అక్కర్లేదు/రెప్పదాటిన ఒక్క కన్నీటి చుక్కచాలు" – అని చెప్పడంలో కాన్సర్ కణం సృష్టించే కల్లోలాన్ని సముద్రంలో సునామీతో పోల్చారు.

ఓ భార్యగా, తల్లిగా, కుటుంబంలో అందరి అవసరాలు తీర్చే మహిళగా నిర్విరామంగా పనిచేస్తూ, అలసిపోతూ, గుండెల్లో బాధ కల్గినప్పుడు ఏదో కండరం పట్టేసిందిలే అనుకున్నా, రాత్రి భర్త తడిమినప్పుడు కలిగే నొప్పి ఓ నిజాన్ని తెలియజేస్తుంది అంటారు. "మేఘాల కలబోతగా ఉండల్సిన/ ఎద ఎత్తుల మెత్తదనం/ఘనీభవించిన శిలాజమై కలవరపెడుతుంది" అని వాపోతారు. వ్యాధి కబళించే దశల్లో ఇది మొదటిది.

భర్త పిల్లలు కాకుండా, పరాయి వారి ముందు హృదయాన్ని విప్పాల్సివస్తుంది అంటారు పరీక్షల కోసం డాక్టర్ వద్దకి వెళ్ళినప్పుడు. పరీక్షల తర్వాత తాను "ఓ నిండైన ప్రిస్క్రిప్షన్ ఫైల్

నవుతాను/ వేర్వేరు టెస్టుల లాబరేటరీనవుతాను" అని అంటారు కవయిత్రి. తదుపరి వ్యాధి రెండో దశలోకి అడుగుపెడుతుంది.

కుటుంబ సభ్యులలో ఎవరికి ఏ జబ్బు చేసిన ఆందోళన చెంది, వారి ఆరోగ్యం కోసం తల్లడిల్లే మహిళ, తన సొంత ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చూపుతుందని అంటారు కవయిత్రి. "నాకేమైనా నేను మాత్రం/ జండూబామ్‌తో సరిపెట్టుకుంటాను/ రేపు చూద్దాంలే.... అనే/ వాయిదామంత్రాన్ని జపించి/తులసి ఆకుని నోట్లో పడేస్తాను." అని అంటారు. కానీ చివరికి పరీక్షలు చేయించుకోవాల్సివస్తుంది. "ఓ ముక్కని బయాప్సీ చేద్దామంటే/మనకేం అవుతుంది?/ I'm Rock Steady అనుకుంటాను./"లైట్ లేలో యార్" అని/టెస్ట్‌లకి రెడీ అవుతాను" అంటారు. బంధుమిత్రుల విషయాలలో పాజిటివ్ థింకింగ్ అలవాటైపోయి, రిపోర్ట్‌లలో కూడా పాజిటివే వస్తుందని – "నిలువెల్లా పవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్/ఇంకిపోయింది కదా–/రిపోర్ట్‌లో కూడ పాజిటివే – వస్తుంది/పాజిటివ్ – పాజిటివ్/మాలిగ్నెన్సీ పాజిటివ్" అని అంటారు. ఇక్కడ్నించి మూడో దశలోకి ప్రయాణం.

"రిపోర్ట్‌లన్నింట్లో తలదూర్చిన డాక్టర్ / శాంతి వచనాల మధ్య /ఆటంబాంబ్‌ని పేలుస్తుంది". దాంతో తనిపుడు ఒక్కరితో కాదు, ఇద్దరితో కాపురం చేస్తున్నాననే సత్యం నెమ్మదిగా 'అర్థం' అవుతుంది. "ఆయన ఒకరు/నా గుండెలపైని రాచపుండు మరొకరు." అంటారు శ్రీలక్ష్మి. తర్వాత ఇంకేముంది, కాన్సర్ ఆసుపత్రిలో అడ్మిట్ అవడమే. "అక్కడ–/ గడ్డ కట్టిన ప్రతి హృదయం/నీకేం కాదన్న భరోసా వాక్యం కోసం నిరీక్షిస్తుంది/" అని అనడంలోనే వ్యాధిగ్రస్తుల గుండెమంటని తెలియజెప్తారు కవయిత్రి.

ఒక్కసారిగా గతంలోకి వెళ్ళి పాలిండ్ల గురించి, అవి తన శరీరం పెరిగి, తనకి కొత్త రూపుని, కొత్త ఐడెంటిటీనీ ఇచ్చిన వైనాన్ని; తన భర్తకి అమరత్వాన్ని, పిల్లలకి పాలధారని అందించిన తీరుని ఒక్కో వాక్యంలో అద్భుతంగా చెప్పిన కవయిత్రి, చనుద్వయం గురించి ఇలా అంటారు – "నా గుండె వైకుంఠానికి/ఇరువైపులా–/రక్షణగా నిలుచున్న/జయ విజయులు కదా....!". మళ్ళీ వర్తమానంలోకి వచ్చి వైద్య పరీక్షలు, చికిత్స తనను ఓ గినీ పిగ్‌లా మార్చేసాయని బాధ పడతారు. తర్వాత కాన్సర్ కణాలు విపరీతంగా పెరిగిపోడంతో, సర్జరీ చేసి వక్షోజాలని తొలగించాల్సివస్తుంది. ఆ క్రమంలో ఆ స్త్రీ వేదనని చదువుతుంటే కన్నులు చెమ్మగిల్లుతాయి.

"అడిగితే కాని అమ్మయినా పెట్టదంటారు./క్యాన్సర్ – అమ్మలగన్నయమ్మ/నేనేది అడగకుండనే/తన కణాలను/నాలో పుట్టలు పుట్టలుగా పెంచింది."

"నా ఉటోపియాని/నా నుంచి దూరం చేసే/అనివార్య పన్నాగం సక్సెస్ అయ్యింది/మూతలు పడుతున్న నా కంటి పాపలకి/నా నిండు చంద్రుళ్ళు/నా జయవిజయులు/స్టీల్ ప్లేట్‌లో/రక్తపు ముద్దలుగా/లీ....ఈ....ఈ....ఈ....ఈ....లగా/ గుండెపెరికి వేసిన గ్లాడియేటర్‌లా/ నాలో నేను జా....ఆ....ఆ....ఆ....ఆ....లిగా".

బాల్యంలో గులాబీ రంగు రిబ్బన్లను బాగా ఇష్టపడినందుకేమో, ఇప్పుడు పింక్ రిబ్బన్ నా కొత్త సహచరి అయిందని వాపోతారు కవయిత్రి. అయితే దైన్యంతో ధైర్యం కోల్పోకుండా – "చంద్రుళ్ళను కోల్పోవటమంటే/నిశీధి చీకటి కాదని/కొత్త సూర్యోదయమని తెలిసొచ్చింది/అందుకే/పింక్ రిబ్బన్‌తో/నాలాంటి కోట్లాది స్త్రీల గుండెల్లో/జీవనేచ్ఛను నింపటానికి/నేను కదం తొక్కాను" అని అంటారు. నిరాశని, నిస్పృహని పారద్రోలుతూ, "ఈ రాచపుండుని/దేహ సంస్కృతిలోని కొత్త పండుగగా ఆహ్వానిద్దాం/ఉరోజ రాహిత్యదశని/ఇన్నాళ్ళూ స్త్రీత్వం పేరిట/వేసిన సంకెళ్ళ నుండి విముక్తిగా భావిద్దాం/జీవన పుస్తకంలో/కొత్త పాఠంలా చదువుకుందాం/ ఈ స్తనాతీత దశని/ మహిళా ప్రస్థానంలో/ నవయుగోదయం అని చాటి చెపుదాం" అంటూ ప్రేరణ కల్గిస్తారు. "నా ప్రియ సహోదరీ,/రా..../ఇప్పట్నుంచీ/'షీ'గా కాకుండా/మని'షి'గా జీవిద్దాం....." అంటూ నూతనోత్సాహం కలిగిస్తారు.

ఈ దీర్ఘ కవితను చదువుతున్నప్పుడు కలిగిన బాధ ముగింపు కొచ్చేసరికి, ధైర్యంగా మారుతుంది. కవయిత్రి ఉద్దేశం నెరవేరిందని అనిపిస్తుంది.

కవిత్వ ప్రయోజనంలో 'చికిత్స' గురించిన 'విచికిత్స' చేస్తూ అధ్యయనం చేస్తున్న క్రమంలో, పొయెట్రీ థెరపీకి ఈ క్రింది లక్షణాలు, లక్ష్యాలుంటాయని నిర్ధారించుకున్నట్లుగా ముందుమాట రాసిన మామిడి హరికృష్ణ అంటారు:

1. వ్యాధి గురించిన అవగాహన కల్పించడం (Awareness Creation)
2. అపోహలు తొలగించడం (Clearance of misconceptions)

3. వ్యాధిని అంగీకరించగలిగే మానసిక సంసిద్ధత (Mental Preparation)

4. వ్యాధిని ఎదుర్కోగలిగే స్థైర్యాన్నివ్వడం (Confidence Building Measures)

5. వ్యాధి నయంకావడం (Cure from Disease)

6. వ్యాధితో సైతం గౌరవంగా బ్రతకగలిగే ఆశావాదాన్ని పాదుగొల్పడం (Living with Disease with honour and Respect)

ఈ లక్ష్యాల వెలుగులో చూస్తే, అయినంపూడి శ్రీలక్ష్మి రాసిన ఈ దీర్ఘకవిత నూటికి నూరుపాళ్ళు సక్సెస్ అయిందనడంలో తనకెలాంటి డౌట్ లేదని, కవిత్వాన్ని చికిత్సా స్థాయికి తీసికెళ్ళే దిశలో ఈ "వూండెడ్ హార్ట్" దీర్ఘకవిత తెలుగులో నిజాయితీతో కూడిన విశుద్ధమైన ప్రయత్నమని కూడా తాను ఘంటాపథంగా చెప్పగలనని ఆయన అన్నారు.

ఈ పుస్తకం చదివిన వాళ్ళు ఆయన అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. మంచి రచన ద్వారా చక్కని ఆశయాన్ని సాధింపజేసుకున్నందుకు అయినంపూడి శ్రీలక్ష్మి గారికి అభినందనలు. తప్పక చదవాల్సిన మంచి పుస్తకం "వూండెడ్ హార్ట్".

~ కొల్లూరి సోమ శంకర్

ప్రాప్తి:

B. Nageswara Rao,

Flat No: 103, Durga Apartments,

Durganagar Colony, Somajiguda, Hyderabad.

&

Vishalandhra Book House

Prajashakthi Book House

Navodaya Book House, Hyd.

ఈబుక్: కినిగెలో

---

For Latest Telugu Books - Visit now:
Kinige.com